

నీళ్లివ్వకుండా.. ఎండలో నిలబెట్టి.. 2

2 తిరుపతికి వెళ్లి.. అదృశ్యం





22న మెడికల్ సంఘం ఎలక్షన్ 2

www.aksharatoday.com

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

## గిరిరాజ్ కాలేజీలో నూతన వృత్తి విద్యాకోర్సులు

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. బీఎస్సీలో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ఎలక్ట్రానిక్, బీకాంలో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

20-6-2025 (FRIDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2

## రిజిస్ట్రేషన్లు ఆపితే చర్యలు:

### డీఐజీ వెంకట రమణ



**అక్షరటుడే, ఇందూరు:** నిబంధనల ప్రకారం స్లాట్ బుక్ చేసుకుని వచ్చే డాక్యుమెంట్లను ఆపవద్దని, అలాంటి వారు ఎవరైనా ఉంటే చర్యలు తప్పవని శాఖ ఇన్‌ఛార్జి డీఐజీ వెంకట రమణ పేర్కొన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీగా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజు వారి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలన్నారు.

**రెండు నెలల సెలవులో డీఐజీ:** స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీగా రమేశ్ రెడ్డి రెండు నెలల పాటు సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ డి.వెంకట రమణకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

## యాదగిరిగుట్ట, స్వర్ణగిరికి ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ నుంచి యాదగిరిగుట్ట, స్వర్ణగిరికి డీలక్స్ బస్సు ప్యాకేజీ టూర్ ఈనెల 27న నిర్వహిస్తున్నామని బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట దర్శనం చేసుకోవాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. బాన్సువాడ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి యాదాద్రి నరసింహస్వామి దర్శనం అనంతరం, స్వర్ణగిరి ద్వారా రాత్రి ఒంటి గంటకు బాన్సువాడ చేరుకుంటుందన్నారు. టికెట్ ధర రూ.1,000 ఉందని బుకింగ్ కోసం 9063408477లో సంప్రదించాలని ఆమె కోరారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 26 వరకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.



**ఒకప్పుడు ఏదైనా సమస్య వస్తే ప్రజలు పోలీస్ స్టేషన్ మెట్లెక్కాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం పోలీసులే ప్రజల వద్దకు వెళ్తున్నారు. నిజామాబాద్ సీపీగా సాయిచైతన్య బాధ్యతలు చేపట్టిన అనంతరం పోలీసులను ప్రజలతో మమేకం చేసేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో సరికొత్తగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి పోలీసులు ప్రజలతో మమేకమవుతున్నారు.** - అక్షరటుడే, నిజామాబాద్

### ఫుట్ పెట్రోలింగ్

ఫుట్ పెట్రోలింగ్‌లో భాగంగా కాలనీల్లో స్థానికులతో పోలీసులు కలియ తిరుగుతున్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అంతేకాకుండా చోరీల నివారణకు జాగ్రత్తలపై ప్రజలకు వివరిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు చెడిపోయిన వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. విధిగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే.. వివరాలు సేకరిస్తున్నారు.

# ప్రజల వద్దకే పోలీసులు..

**• నిజామాబాద్ సీపీ వినూత్న కార్యక్రమం • కమిషనరేట్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహణ**

మత్తు పదార్థాలతో పాటు దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. కాలనీలతో పాటు శివారు ప్రాంతాల్లో గంజాయి, మద్యం తాగి న్యూసెన్స్ చేసేవారిని కట్టడి చేసేందుకు కాలనీల్లోకి కొత్తగా వచ్చిన వారి వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాకుండా అనుమానితులు వస్తే వారి వివరాలను సేకరించడానికి నిఘా ఉంచారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కావొద్దని అవగాహన కల్పిస్తున్నారు. వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు.

### అవగాహన కార్యక్రమాలు

జిల్లావాప్తంగా పోలీసులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నివారణ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు. అంతేకాకుండా మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు, మహిళ భద్రతకు షీటీంల పనితీరును వివరిస్తున్నారు. అలాగే సైబర్ మోసాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు.



### అనుమానితుల విచారణ

సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు పోలీసులు జిల్లావ్యాప్తంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 25 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 700లకు పైగా వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. పోలీసులు చేపట్టిన ఈ చర్యలతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెనువెంటనే తమ సమస్యలు పరిష్కారం కావడం పట్ల పోలీసుల పనితీరును ప్రశంసిస్తున్నారు.

## జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒలింపిక్ రన్ నిర్వహించారు. నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన రన్ పెద్దబజార్, నెహ్రూ పార్క్, గాంధీచౌక్, బస్టాండ్ మీదుగా పాతకలెక్టరేట్ మైదానం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా క్రీడల్లో జిల్లా క్రీడాకారులు దేశానికి ప్రాతినిథ్యం వహించడం గొప్ప విషయమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది క్రీడాకారులు పైకి రావాలన్నారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రన్‌లో స్కేటింగ్ క్రీడాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు ఈగ సంజీవరెడ్డి, ఛైర్మన్ లింగయ్య, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒలింపిక్ టార్చ్‌తో సీపీ సాయి చైతన్య




రన్‌లో పాల్గొన్న విద్యార్థులు



డీఈవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

## టీచర్ల డిప్యుటేషన్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యాశాఖలో డిప్యుటేషన్లపై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కనీసం సమాచారం లేకుండా మీరే నిర్ణయాలు తీసుకుంటే మేమెందుకని ప్రశ్నించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ సురేష్ షెట్కార్ అధ్యక్షతన దిశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే విద్యాశాఖ అధికారులతో పైవిధంగా స్పందించారు. టీచర్ల అంతర్ జిల్లాల డిప్యుటేషన్‌పై దిశ కమిటీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు డీఈవో సమా ధానమిస్తూ అంతర్ జిల్లాల డిప్యుటేషన్ తమ పరిధిలో ఉండదని తెలిపారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు టీచర్ల డిప్యుటేష న్‌పై తమకు సమాచారం అందించాలని సూచించారు. ఎర్రపహాడ్ పాఠశాల భవనం కూలిపోయే స్థితిలో ఉంటే ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.18 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతు భీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీ సురేష్ షెట్కార్ అధికారులకు సూచించారు.



## విద్య, వైద్య రంగాలకు హబ్‌గా బాన్సువాడ

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడను విద్య, వైద్య రంగాలకు హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులో ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవన సముదాయ పనులపై శుక్రవారం హైదరా బాద్‌లోని తన కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. రూ.40 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సింగ్ కళాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని, విద్యతోనే సామాజికంగా, ఆర్థికంగా మార్పు వస్తుందన్నారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాంచందర్



రాంచందర్‌ను అభినందిస్తున్న బాణాల లక్ష్మారెడ్డి

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని షెట్‌పల్లికి చెందిన వడ్ల రాంచందర్ బీజేపీ కామారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు శుక్రవారం ప్రకటించారు. దీంతో మండల నాయకులు పలువురు ఆయన్ను అభినందించి, సన్మానించారు. రాంచందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా యోగా దినోత్సవం




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని మారుతి నగర్‌లోని స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ హాజరై మాట్లాడారు. యోగా మన జీవితంలో ఓ భాగంగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ నిర్వాహకులు ఎస్ సిద్దయ్య, అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, యోగా ఉపాధ్యాయురాలు వీణ ఉన్నారు.

## స్కూల్ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్కూల్ బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాగిరెడ్డిపేట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ పోచమ్మ ఆలయం రోడ్‌లో కేరళ స్కూల్ బస్సును బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న దేవిసింగ్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# నీళ్లు ఇవ్వకుండా.. విద్యార్థులను ఎండలో నిలబెట్టి..

**అక్షరటుడే, తాడ్వాయి:** పాఠశాలకు లేటుగా వచ్చారని విద్యార్థులతో పాఠశాల సిబ్బంది అమానుషంగా ప్రవర్తించారు. మండుటెండలో విద్యార్థులను వారి తల్లిదండ్రులతో సహా గంటల తరబడి ఎండలో నిలబెట్టారు. ఈ ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఈనెల 15న విద్యార్థులను తీసుకుని రావాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలను ఐదురోజులు లేటుగా శుక్రవారం పాఠశాలకు తీసుకెళ్లారు. దీంతో లేటుగా వచ్చారని ఆరోపిస్తూ గురుకుల పాఠశాల సిబ్బంది కనీసం గేటు కూడా తీయలేదు. ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల గేట్‌కు బయటి నుంచి తాళం వేశారు. ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తల్లిదండ్రులను సముదాయించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల లోపలికి అనుమతించారు.



పాఠశాల గేట్ తెరవకపోవడంతో బయట నిలబడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు

## బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా అజయ్



**అక్షరటుడే ఇందూరు:** బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా బగ్గలి అజయ్‌ను నియమిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, దేవేందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, విజయ్, గంగాధర్, చంద్రకాంత్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని డీఈవో అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు. కావున జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల పిల్లలకు రాయితీ కల్పించాలని పేర్కొన్నారు.

## దోస్త్ గడువు పెంపు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డిగ్రీ కళాశాలల్లో ఫస్టియర్‌లో ప్రవే శాలకు దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ గడువు పొడిగించినట్లు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈ మేరకు ఈనెల 25 వరకు అవకాశమిచ్చిందని, ఈ అవకాశాన్ని ఎల్లారెడ్డి ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పాఠశాలకు బెంచీల వితరణ

**అక్షరటుడే, బాన్సువాడ:** బోర్లం ప్రాథమిక పాఠశాలలో బెంచీల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా.. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్పందించారు. తమవంతు బాధ్యతగా 21 బెంచీలను శుక్రవారం హెచ్ఎం గోపికి అందజేశారు. ఉపాధ్యాయులు సంతోష్, చైతన్య, సత్యనారాయణ, రమేష్ రాథోడ్, తల్లిదండ్రులు విజయ్ భాస్కర్, విఠల్, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** కార్మికుల హక్కుల సాధనకు జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ బహుజన బీడీకార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం దోమకొండలోని ఓ బీడీ కంపెనీలో మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమపై ఆంక్షలు ఎత్తి వేయాలని, జీఎస్టీ తొలగించాలని, కోప్టా చట్టం రద్దు చేయాలని, బీడీ కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వం రూ.10వేల పింఛన్, తదితర డిమాండ్ల సాధనకు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు యెల్లయ్య, కార్మికులు ఉన్నారు.



## తాడ్కోల్‌లో ఒకరి బలవన్మరణం..

**అక్షరటుడే, బాన్సువాడ:** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముండే ఇందూరు రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొన్నాళ్లుగా వీరంతా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఇటీవల తాడ్కోల్‌కు వచ్చిన రాజు ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డీహెచ్ఎంవో తుకారాం రాథోడ్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ యోహాన్, ఎంపీడీవో లింగం, ఎంఈవో శ్రీనివాస్ తదితరులున్నారు.



## తిరుపతి దర్శనానికి వెళ్లి.. కుటుంబం అదృశ్యం

**అక్షరటుడు, బోధన్:** దైవ దర్శనానికి వెళ్లిన ఓ కుటుంబం అదృశ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు మెగావత్ మోహన్, లక్ష్మి వారి కూతురు శిరీష ఈనెల 14న తిరుపతి వెళ్లారు. 17న తిరిగి వస్తున్నట్లు మోహన్ తన బావమరిది మెగావత్ రవీందర్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం ఆయన మోహన్ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో రవీందర్ రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కుటుంబం ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

## తెయూ గణిత అధ్యాపకురాలికి డాక్టరేట్



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఆర్మూర్ మండలం ఇస్సన్నపల్లికి చెందిన గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమ్మెడ పద్మకు గౌరవ డాక్టరేట్ వరించింది. మిజోరంకు చెందిన ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ పొందారు. పద్మ తెయూలోని గణిత విభాగంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. డాక్టరేట్ రావడంపై వర్సిటీ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, సైన్స్ డీన్, మ్యాథమెటిక్స్ విభాగం అధిపతి, అధ్యాపకులు అభినందించారు.

## ఈనెల 22న జిల్లా మెడికల్ సంఘం ఎన్నికలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 22న జరగనున్నా యి. అలాగే జిల్లా సర్వసభ్య సమావేశం సైతం జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లోగల మున్నూరుకాపు సంఘంలో జరగనుంది. సమావేశం అనంతరం సాయంత్రం ఎన్నికల ప్రక్రియ ఉండగా, పోటీ చేసే అభ్యర్థులు 15 రోజులుగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. తమనే గెలిపించాలని అధ్యక్ష కార్యదర్శులు నల్ల మధుసూదన్, బీర్కూరు సుధాకర్, కోశాధికారి మోర సాయిలు ప్రచారం చేస్తుండగా, మార్పు కోసం తమకు అవకాశమివ్వాలని ప్రత్యర్థి అభ్యర్థులు కొండ సత్యప్రసాద్, సంతోష్, రమేష్ ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నగరంలోని వినాయక్ నగర్‌లో ప్రచారం చేశారు. సమావేశంలో ఏజెన్సీ ప్రతినిధులు భూమేష్, జీవన్ రెడ్డి, సతీష్ రెడ్డి, అనిల్ గౌడ్, రంజిత్ గౌడ్, దత్తు యాదవ్, చాట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

